నేర్చుకుంటూ.. రైతులకు నేర్పిస్తూ..

- ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా సత్తుపల్లి నుంచి అర్వపల్లికి వచ్చిన విద్యార్థినులు
- ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పొందుతూ.. రైతులకు అవగాహన



సేంద్రియ వ్యవసాయంతో సాగవుతున్న అరటితోటలో విద్యార్థినులు



జీవామృతం తయారు చేస్తూ..

అర్వపల్లి : ప్రకృతి వ్యవసాయం (సేంద్రియ వ్యవసాయం)పై శిక్షణ పొందుతూ.. ఈ శిక్షణను ఉపయోగించుకొని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.. అగ్రికల్చర్ ఇంజనీరింగ్ డిప్లమా విద్యార్థినులు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని మదర్ థెరిస్సా పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఇంజనీరింగ్ డిప్లమా తృతీయ సంవత్సరం విద్యార్థినులు ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా గత 75 రోజుల నుంచి అర్వపల్లి శివారులోని వీఆర్ఆర్ ఆర్గానిక్ ఫాంలో శిక్షణ పొందుతున్నారు. అయితే వీరు ఇక్కడి ఫాంలో సేంద్రియ వ్యవసాయం ద్వారా సాగవుతున్న అరటితోట సాగు, ఆకుకూరలు, కూరగాయల తోటలు, పండ్ల చెట్లు, కొబ్బరితోటలపై శిక్షణ పొందుతున్నారు. అలాగే ఫాంలోని చెరువులో సేంద్రియ విధానంలో చేపల పెంపకం, నాటు కోళ్ల పెంపకం జరుగుతుంది. వీటన్నిటిని క్షేత్ర స్థాయిలో చూస్తూ అవగాహన పొందుతున్నారు. ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా విద్యార్థినులు ప్రత్యేకంగా కొన్ని ఆకుకూరలు కూడా సాగు చేశారు. ఫాంలోని గ్రాస్‌కట్టర్, బండ్‌ఫార్మర్, పవర్ టిల్లర్, డ్రిల్లింగ్ మిషన్ తదితర యంత్రాల పనితీరును పరిశీలిస్తూ వాటితో స్వయంగా పనిచేస్తున్నారు.

జీవామృతం తయారీ, పిచికారీ..

ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జీవామృతం, వేస్ట్ డీకంపోజర్‌ను తయారు చేయడం, వీటిని ఫాంలోని చెట్లకు పిచికారీ చేయడం నేర్చుకుంటున్నారు. చెట్ల వేర్లకు డ్రిప్ ద్వారా నీటిని అందిస్తున్నారు. తాము నేర్చుకున్న విషయాలను సమీపంలోని గ్రామాల రైతుల వద్దకు వెళ్లి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. పురుగు మందులు ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాలు, ప్రకృతి వ్యవసాయంతో కలిగే లాభాలు తెలియజేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయం నేర్చుకున్న



ప్రకృతి వ్యవసాయం ఎలా చేయాలనే విషయమై నేను మా కళాశాల నుంచి ఇక్కడికి వచ్చి నేర్చుకున్నా. ప్రకృతి వ్యవసాయం రైతులకు, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ప్రతిరైతు సేంద్రియ వ్యవసాయం చేయాలి.

- పూజిత, అగ్రికల్చర్ విద్యార్థిని

సంతోషంగా ఉంది



మా కళాశాల నుంచి ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా అర్వపల్లిలోని ఆర్గానిక్ ఫామ్‌కు వచ్చి 75 రోజులుగా శిక్షణ పొందుతున్నాం. శిక్షణలో నేర్చుకున్న విషయాలను రైతుల వద్దకు వెళ్లి వారికి అవగాహన కల్పించడం సంతోషంగా ఉంది.

- నయనిష, అగ్రికల్చర్ విద్యార్థిని

ఎంతో ఉపయోగకరం



ప్రాజెక్టు వర్క్ ద్వారా మాకు ఎంతో అనుభవం వచ్చింది. జీవామృతం ద్వారా పంటలను ప్రతి రైతు సాగు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. దీంతో రోగాలు దరిచేరవు.

- సాయికృప, అగ్రికల్చర్ విద్యార్థిని

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



సూర్యాపేట టౌన్ : స్వపరిపాలన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



తుంగతుర్తిలోని మేరీమదర్ పాఠశాలలో బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీపీ కవిత

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని విద్యా భారతి ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, మంత్రులుగా, గవర్నర్‌గా వేషధారణలతో అలరించారు. ఉత్తమ బోధన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తాహేర్ పాషా, ప్రధానోపాధ్యాయుడు నంద్యాల దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాని ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మేరీమదర్ పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారుల, ప్రజాప్రతినిధుల ప్రాతలను పోషించి ఆకట్టుకున్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంపీపీ, ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేరీ విజ్జి, మేనేజర్ లేసియా, వైస్‌ప్రిన్సిపల్ మేరీ రిన్సీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో ఈ నెల 6న వరంగల్‌కు చెందిన శరత్ మాక్సి విజన్ లేజర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్యాంసుందర్ రెడ్డి, ఎస్.నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే వైద్య పరీక్షలకు పెన్షనర్లు తమ హెల్త్ కార్డులు తీసుకొని హాజరు కావాలని వారు కోరారు.

అసంపూర్తి పనులు త్వరగా పూర్తి చేయాలి

సూర్యాపేట రూరల్ : గ్రామాల్లో అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం సూర్యాపేట పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని నర్సరీల్లో విత్తనాలు నాటడం, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం, హరితహారంలో మొక్కలకు నీళ్లు పోయడం వంటి పనులు పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పరాంకుశరావు, ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తిరుమలగిరి : తిరుమలగిరికి చెందిన పాలబిందెల రామచంద్రు ఇటీవల మృతి చెందారు. దీంతో మృతుడి కుటుంబానికి అతడి స్నేహితులు శనివారం రూ.30వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో మృతుడి మిత్రులు,తదితరులు ఉన్నారు.

పశు వైద్యశిబిరం

అర్వపల్లి : 4 నెలల నుంచి 8 నెలలలోపు దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి రాకుండా రైతులు టీకాలను తప్పనిసరిగా వేయించాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ కోరారు. శనివారం కుంచమర్తిలో దూడలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీఎల్ఓ కేఎస్ఎస్ పద్మ, బత్తుల రాములు, స్వరాజ్యం, నగేష్, మన్నె పుల్లయ్య, లింగయ్య, అవిలమ్మ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీఎస్పీనే..



మాట్లాడుతున్న దండోలు తిరుపతి

అర్వపల్లి : బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీఎస్పీనేనని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, హైకోర్టు న్యాయవాది దండోలు తిరుపతి అన్నారు. శనివారం అర్వపల్లిలో జరిగిన బీఎస్పీ ని యోజకవర్గ సమావేశంలో మాట్లాడారు. బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)ని గడప గడపకూ తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. బీఎస్పీ ఎదుగుదలను జీర్ణించుకోలేక బీఆర్ఎస్ దాడులకు పాల్పడుతోందని తెలిపారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే గువ్వల బాలరాజు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బుడిగె మల్లేష్‌యాదవ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డు కిరణ్, ముస్తాల కిషన్, బాబునాయక్, పిడమర్తి దశరథ, దాసరి శ్రీను, చింతకుంట్ల చింతయ్య, కమటం శోభ, మండల అధ్యక్షుడు చెరుకుపల్లి లక్ష్మణ్, జీడి వెంకన్న, నవీన్, మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి



మద్దిరాలలో మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బర్పటి క్రాంతి కుమార్

తిరుమలగిరి : ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లను ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.ఆనంద్‌భాస్కర్ కోరారు. శనివారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలాల్లోని ఖాళీలన్నింటిని నిష్పక్షపాతంగా చూపించాలని కోరారు. అంతర్ జిల్లా బదిలీల్లో జిల్లాకు వచ్చిన వారి వివరాలను వెల్లడి చేసి నిబంధనల ప్రకారం జాబితాలో స్థానం కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో మండల శాఖ అధ్యక్షుడు గుడిపాటి నరేష్, జి.వెంకటేశ్వర్లు, ఆర్.ఉమారాణి, అజయ్‌కుమార్, సరిత, కవిత, శ్రీలత పాల్గొన్నారు.

మద్దిరాల : ఉపాధ్యాయ బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బర్పటి క్రాంతికుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో బదిలీ, ప్రమోషన్ జాబితాలో దొర్లిన పొరపాట్లను సవరించి నూతన జాబితాను పారదర్శకంగా రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు ఎస్‌కే. సైదులు, ఎండీ. సాహెబ్ అలీ, ఇరుగు యాదగిరి, దామళ్ల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

దేశంలో నిరుద్యోగ సమస్య విలయతాండవం



మాట్లాడుతున్న ఇందూరు సాగర్

అత్మకూర్ (ఎస్) : రాష్ట్రంలో, దేశంలో నిరుద్యోగ సమస్య విలయ తాండవం చేస్తోందని, యువత నిరుద్యోగ సమస్యపై ఉద్యమించాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరు సాగర్ అన్నారు. శనివారం బొప్పారం గ్రామంలో నిర్వహించిన మండల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాక యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వైద్య రంగంలో డాక్టర్లు, నర్సుల పోస్టులు ఖాళీగా ఉండటంతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందడంలేదని తెలిపారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మత ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఆస్తులను కార్పొరేట్లకు అంటగడుతూ పేదలపై ధరల భారం మోపుతోందన్నారు. దామెర శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, అరుణోదయ జిల్లా నాయకుడు కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి అలుగుబెల్లి వెంకటరెడ్డి, ఇరుగు సురేష్, పోతురాజు ప్రతాప్, కలంచర్ల ప్రతాప్, దేశోజు మధు, పగడాల సుధాకర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, గుండె వెంకన్న, లింగయ్య, రవి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్నేహితుల దుర్మరణం

- జనగామ జిల్లాలో బైక్‌ను ఢీకొన్న డీసీఎం
- మృతులు ఫణిగిరికి చెందినవారు



నాతి ప్రశాంత్ (ఫైల్)



బొడ్డు నవీన్ (ఫైల్)

కొడకండ్ల : చిన్ననాటి నుంచి పదో తరగతి వరకు కలిసి చదువుకున్న ఇద్దరు స్నేహితులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు వదిలారు. వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండా శివారు పెట్రోల్ పంపు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం పణిగిరి గ్రామానికి చెందిన నాతి ప్రశాంత్(19), బొడ్డు నవీన్(20)లు గ్లామర్ బైక్‌పై జనగామ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో గిర్నితండా పెట్రోల్ పంపు సమీపంలో ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు ఎగిరిపడిపోయారు. తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం కావడంతో ఇద్దరు మిత్రులు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై కొమురెల్లి సంఘటన స్థలానికి చేరుకొని మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫణిగిరిలో విషాదఛాయలు

నాగారం : రోడ్డు ప్రమాదంలో నాగారం మండలం ఫణిగిరికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఫణిగిరి గ్రామానికి చెందిన నాతి వెంకన్న-శోభ దంపతుల ఏకైక కుమారుడు నాతి ప్రశాంత్ (21), బొడ్డు వెంకన్న-పద్మ దంపతుల రెండో కుమారుడు బొడ్డు నవీన్ (20) ఇద్దరు స్నేహితులు. శనివారం నాతి ప్రశాంత్, బొడ్డు నవీన్‌లు ఇద్దరు కలిసి ఫణిగిరి గ్రామం నుంచి బైక్‌పై జనగామకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మతిచెందారు.

శోకసంద్రంలో ఇరు కుటుంబాలు

చేతికంది వచ్చిన యువకులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. నాతి వెంకన్న-శోభ దంపతుల కుమారుడు ప్రశాంత్ తిరుమలగిరిలో డిగ్రీ ద్వితీయసంవత్సరం చదువుతున్నాడు. అలాగే బొడ్డు వెంకన్న-పద్మ దంపతుల చిన్న కుమారుడైన నవీన్ తిరుమలగిరిలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఆశలను అడియాశలు చేస్తూ మృత్యువు ఒడిలోకి చేరడంతో వారి తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

నాగారం : బిక్కేరు వాగు నుంచి అనుమతులు లేకుండా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని బీజేవైఎం మండల నాయకుడు అనంతుల సోమేష్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడమే కాకుండా డ్రైవర్లు అతివేగం ట్రాక్టర్లను నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు.



జాతర సందర్భంగా పెద్దగట్టు వద్ద ఆలయం వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది



ఆలయానికి వెళ్లే దారిలో దుకాణదారులు ఏర్పాటు చేసిన గుడిసెలు



ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్‌రూమ్



మహిళల కోసం ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్స్

ప్రజా సమస్యలు విస్మరించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

చివ్వెంల : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం చివ్వెంల మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి నేటి వరకు అమలు చేయలేదని అన్నారు. కేసీఆర్ పాలనలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందించే ఉజ్వల గ్యాస్‌ను అర్హులైన నిరుపేదలు తీసుకోలేకపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తెలంగాణలో అమలు చేయడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పేరువాల లక్ష్మణరావు, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ధరావత్ శ్రీను నాయక్, మండల ప్రధాన కార్యదర్శులు జంపాల వెంకన్న, బిట్టు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సూర్యాపేట : ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులను గుర్తించి వేతనాలు పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు వెంపటి గురూజీ అన్నారు. శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక క్యాంపు కార్యాలయంలో సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి మాట్లాడారు. వేతనాలు పెంచుతూ జీఓ విడుదల చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కనుకుంట్ల ఉప్పమ్మ, జిల్లా కోశాధికారి సైదమ్మ, మాచర్ల రామలక్ష్మి, రమాదేవి, నాగమణి, మండలి దుర్గా, మంగ, లక్ష్మి, యశోద, రాణి, మంగమ్మ, పర్వీన్, ఎల్లమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

వర్ధెల్లి బుచ్చిరాములుకు ఘన నివాళి



దురాజ్‌పల్లి : బుచ్చిరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



సూర్యాపేట : వాణిజ్య భవన్ సెంటర్‌లో..



చివ్వెంల : నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

దురాజ్‌పల్లి : సీపీఎం సీనియర్ నాయకుడు వర్ధెల్లి బుచ్చిరాములు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. శనివారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎంవీఎన్ భవన్‌లో వర్ధెల్లి బుచ్చిరాములు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు చిన్నపంగా నరసయ్య, నాయకులు మామిడి సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరాములు ఆశయాలు సాధించాలి

సూర్యాపేట : సీపీఎం సీనియర్ నాయకుడు వర్ధెల్లి బుచ్చిరాములు ఆశయాల సాధనకు కృషి చేయాలని టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం బుచ్చిరాములు వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు, సహచరులు సూర్యాపేట పట్టణంలోని వాణిజ్యభవన్ సెంటర్లో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ వర్ధెల్లి శ్రీహరి, దేవత కిషన్, న్యాయవాదులు సవేందర్, నల్లగుంట్ల అయోధ్య, ఇరుగు వెంకటయ్య, బోళ్ల సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

చివ్వెంల : సీపీఎం సీనియర్ నాయకుడు వర్ధెల్లి బుచ్చిరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని వివేకానంద వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరాములుకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి లక్ష్మీనారాయణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లనున్న సూర్యక్షేత్రం

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రం దేశంలో గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లనుందని ఏపీలోని తిరుమల తిరుపతి దేవస్థాన అనుబంధ శ్రీనివాసమంగాపురం దేవాలయ ప్రధాన అర్చకుడు బాలాజీశర్మ అన్నారు. శనివారం తిమ్మాపురంలోని సూర్యక్షేత్రాన్ని సందర్శించి క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏపీలోని అరసవెల్లిలో సూర్యక్షేత్రం ఉండగా తెలంగాణలో కూడా తిమ్మాపురంలో సూర్యక్షేత్రం ఏర్పడిందని చెప్పారు. కార్యక్రమంలో వ్యాపారవేత్తలు మీలా వాసుదేవ్, అనంతుల ప్రభాకర్, క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, క్షేత్ర నిర్వాహకుడు గణపురం నరేష్, అర్చకులు రామశర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిని కలిసిన పటేల్ రమేష్ రెడ్డి

భానుపురి : హైదరాబాద్ పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రేను సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు గట్టు శ్రీనివాస్, షఫీ ఉల్లా, వల్దాస్ దేవేందర్, ధరావత్ వెంకన్న, ధర్మ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఠాక్రేను కలిసిన పటేల్ రమేష్‌రెడ్డి

క్లుప్తంగా

జాతరలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



జాతర పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి

సూర్యాపేట : జాతరలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి తెలిపారు. శనివారం జాతర పరిసర ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. జాతర వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర పనుల కోసం సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ ప్రసాద్, డీఈ సత్యరావు, సారగండ్ల శ్రీనివాస్, నరేందర్, రాజురెడ్డి, గౌసోద్దిన్, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు కేసారం గ్రామానికి మంత్రి రాక

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని కేసారం గ్రామానికి ఆదివారం రాత్రి మంత్రి జగదీశ్‌రెడ్డి రానున్నట్లు సర్పంచ్ మెంతబోయిన నాగయ్య, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గొర్ల గన్నారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ లింగమంతుల స్వామి, సౌడమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు చేస్తారని పేర్కొన్నారు. అనంతరం దేవతలను పెద్దగట్టుకు తరలించనున్నట్లు తెలిపారు. దీంతో పెద్దగట్టు జాతర ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమానికి అన్నివర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు.

కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి జరిగే కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే కిశోర్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేందర్‌రావులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించనున్నారని జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్, దేవస్థాన చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్ తెలిపారు. గత వైభవాన్ని తెచ్చేలా కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు.

విద్యుత్ ఛార్జీల పెంపు తగదు

నూతనకల్ : విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపడం తగదని, వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ నుంచి యూనిట్‌కు 30పైసల చొప్పున ఛార్జీలు పెంచడం కోసం అనుమతులు ఇవ్వడం దారుణమని అన్నారు. ఇప్పటికే విద్యుత్ ఛార్జీలు సామాన్యులు మోయలేని విధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యానాల వెంకట్‌రెడ్డి, రవి, రామ్మూర్తి పాల్గొన్నారు.

సోమిరెడ్డి మృతి తీరని లోటు




నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

తిరుమలగిరి : వాసిరెడ్డి సోమిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం ఆయన తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోమిరెడ్డి పేదల పక్షాన సమస్యల పరిష్కారానికి పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యుడు మాండవ వెంకటేశ్వర్లు, ధనుంజయనాయుడు, యాదగిరి, మల్లయ్య, ప్రభాకర్, వెంకటయ్య, పున్నయ్య పాల్గొన్నారు.

సోమిరెడ్డికి ఘన నివాళి

సీపీఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి సోమిరెడ్డి గుండెపోటుతో మరణించారు. దీంతో అతడి చిత్రపటానికి శనివారం సామాజిక తెలంగాణ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎల్లంల యాదగిరి, వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సూర్యాపేటకు నూతన శోభ



బొమ్మల ఏర్పాటును పరిశీలిస్తున్న కమిషనర్

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో జంక్షన్ల అభివృద్ధిలో భాగంగా పీఎస్ఆర్, రాఘవ ప్లాజాల వద్ద నూతన శోభ సంతరించుకుంది. రహదారుల వెంబడి జింక, నెమలి, ఎద్దు, గ్రీనరీ బొమ్మలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమాలను శనివారం మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దామిడి శ్రీనివాస్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.